## కథ

### అబ్బరాజు జయలక్ష్మి



# ఆశ..దోసె..అప్పడం..వడ!

"ఏవండోయ్!"

"......"

"మిమ్మల్నే!"

"ఆ..! వస్తున్నా!"

"ఇదిగో! శంకరం! నిన్నేనోయ్!"

భ్రమరాంబకు భర్తమీద కోపం వస్తే బహువచనం నుండి ఏకవచనంలోకి దిగిపోతుంటుంది. ఆ కోపం మరి కాస్త ఎక్కువయిందంటే "ఏరా!" "పోరా!" అని కూడా అంటుంది.

అసలు భ్రమరాంబకు శంకరాన్ని అలా పిలిచే హక్కు పుట్టుకతోనే వచ్చింది మరి! మేనత్తకొడుకయిన శంకరంతో చిన్నప్పటినుండి ఉన్న చనువు పెళ్ళయి పెళ్ళాంగా మారాక అధికారమయింది.

"ఏవోయ్! భ్రమరం!" అని శంకరం పిలిస్తే-

"ఏంటోయ్! శంకరం?" అంటూ పలుకుతుంది.

అదీకాకపోతే "ఏంటిరా సంగతి?" అనేస్తుంది.

"అదుగో! అదే వద్దనేది! ఎంత మేనత్త కొడుకునయినా నేను నీకు మొగుడ్నీ కదా! ఎవరయినా వింటే ఏమనుకుంటారు? కాస్త రెస్పెక్ట్ ఇవ్వాలి భ్రమరం" అంటాడు శంకరం.

"ఓ! అలాగే రెస్పెక్టే కదా! ఇస్తాను తీసుకో" అంటూ శంకరం వీపుమీద ఒక్కదరువు వేసి పడి పడి నవ్వేస్తుంది. అందుకే శంకరమే ఎవరయినా ఉన్నప్పుడు భార్యకు కోపం రాకుండా జాగ్రత్తపడుతూ ఉంటాడు.

"అబ్బబ్బ! ఆ బ్రహ్మరాతలేమిటి? ఎంత పిలిచినా పలక్కుండా! అలా బుర్రవంచుకుని అదేపనిగా ఏం రాస్తున్నావురా?" అంటూ వచ్చి శంకరం చేతిలో నుండి పెన్ను లాగేసింది భ్రమరాంబ.

"కొంచెం ఆగు భ్రమరం! ఈ ఉత్తరం పూర్తిగా రాయనీ!"

"ఉత్తరమా! ఎవరికి? నాకేనా?"

"ఎదురుగా నువ్వుండగా ఎందుకే భ్రమరం! నీకు ఉత్తరం?" అంటూ కవిత రూపంలో గానం చేస్తున్న శంకరాన్ని పట్టుకుని "చెప్పరా!" అంటూ చెవి మెలేయబోతున్న భ్రమరాంబ నుండి ఎలాగో తప్పించుకున్నాడు.

"మంచి ఉత్తరానికి వారం వారం బహుమతి ఇస్తారట ఈ పత్రిక వాళ్ళు. అందుకే ప్రతివారం రాస్తున్నాను. ఈ వారమైనా తప్పకుండా బహుమతి నాకే రావాలి" అన్నాడు శంకరం.

"ఏమిటా బహుమతి? ఫ్రిజ్జా? ఎయిర్ కూలరా?" అని ఆశగా అడిగింది భ్రమరాంబ.

"భలేదానివే భ్రమరం! ఉత్తరానికి అంత పెద్ద బహుమతి ఇస్తారా ఎవరయినా?"

"బాగానే ఉంది సంబడం" అంటూ పెన్ను అక్కడ పడేసి అవతలకి వెళ్ళింది భ్రమరాంబ.

అలా బహుమతి కోసం వారం వారం ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు శంకరం. ఎన్నాళ్ళయినా బహుమతైతే రాలేదు కానీ ఉత్తరాల రచయితగా మాత్రం పేరు తెచ్చుకున్నాడు శంకరం.

* * *

అయిన సంబంధమే కదా అని కానీ కట్నం కూడా ఇవ్వలేదు శంకరానికి. పైగా పిసినారి మామ పిల్లనిచ్చిందే నీకు గొప్ప అన్నట్లు మాట్లాడుతూ ఉంటాడు.

"ఏంటల్లుడూ! ఈ నెల జీతాల మీద ఏం బ్రతుకుతారు? ఏదయినా వ్యాపారం చేసుకోరాదూ?" అంటూ ఉచిత సలహాలిస్తూ "పెట్టుబడి కోసం మాత్రం నన్ను అడగొద్దు" అని కూడా మొహమాటం లేకుండా ముఖం మీదే చెప్పేస్తాడు.

ఆయన ఇంకా ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలి మరి! శంకరంలాగా కట్నం తీసుకోకుండా చేసుకునే వారెవరున్నారా అని బయటి సంబంధాల కోసం తీవ్రంగా గాలిస్తున్నాడాయన. ఆయన ఆశ నెరవేరుతుందో లేదో కూడా ఆయనకే తెలియటం లేదు.

మావయ్య అలా నవ్వుతూ అన్నప్పటికీ శంకరంలో మాత్రం పట్టుదల పెరిగింది. ఎలాగైనా ఎక్కువ డబ్బు సంపాదించాలి. గొప్పవాడైపోవాలి. సొంత ఇల్లు, కారు, బేంక్ బేలన్స్ ఏర్పరచుకుని దర్జాగా బతికేయాలి. అందుకు వ్యాపారం చేయటంకంటే ఏదయినా పెద్దమొత్తంలో ఒకేసారి వచ్చి వళ్ళో పడే అవకాశాల కోసం వేట మొదలుపెట్టాడు. లాటరీ టిక్కెట్లు కొనటం మొదలుకొని లాభాలు వచ్చే షేర్లు తీసుకోవటం వరకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు. కానీ ఏదీ తగలటం లేదు. అదృష్టం కలిసిరావటం లేదు. ఏదో ఒకరోజు ఆ టైమ్ రాకపోతుందా! అని అనుకుంటూ ఉంటాడు.

* * *

ఒకసారి పనిమనిషి రత్తాలు వచ్చింది చూసుకోకుండా భ్రమరాంబ భర్తను "ఏరా!" అని సంబోధిస్తూ ఏదో మాట్లాడుతూ ఉంటే అది విన్నది.

"అమ్మగారూ! ఎవరితోనమ్మా మాట్లాడుతున్నారు?" అని అడిగింది.

"నీకెందుకే? నీ పని చూసుకో" అని కసిరింది భ్రమరాంబ.

"పెనిమిటిని 'ఏరా, పోరా' అంటుంది ఈయమ్మ. ఇదెక్కడి చోద్యమో! చదువుకున్నోళ్ళు చాలా చిత్రంగా ఉంటారు" అనుకుంది రత్తాలు.

"రత్తాలు ఇరుగమ్మా పొరుగమ్మల దగ్గర తమ గురించి అనవసరంగా ఏం వాగుతుందో ఏమో. దాని నోరు మూయించాలంటే ఒకటే మార్గం అని ఆలోచించింది భ్రమరాంబ.

"రత్తాలూ! ఇదుగో ఈ చీర తీసుకో. పండక్కి కట్టుకో" అంటూ ఓ చీర దాని చేతిలో పెట్టింది.

ఇంటికెళ్ళాక చీరమడత విప్పి మీద వేసుకుని తిప్పి తిప్పి చూసుకుంది రత్తాలు.

వంగపండురంగు చీర మీద గులాబి పువ్వులున్న సిల్క్ చీర.

"అమ్మగారు మొన్నటిదాకా కడుతూ ఉన్న చీరే ఇది. చీర బాగానే ఉంది కానీ పండక్కి కొత్తచీర కొనిస్తే బాగుండేది. పాత చీర ఇచ్చారు. అమ్మగారి నుండి డబ్బులు అడిగి తీసుకుని కొత్తచీర కొనుక్కోవాలి" అనుకుంది రత్తాలు ఆశగా.

* * *

బస్టాండులో బస్సుకోసం ఎదురు చూస్తూ నిలబడ్డాడు శంకరం.

"ఈ బస్ ఏ రోజూ టైమ్‌కు రాదు కదా! ఏదయినా బంపర్ లాటరీ గనక తగిల్తే ముందు ఒక కారు కొనుక్కోవాలి. అప్పుడు హాయిగా రోజూ కారులో ఆఫీసుకు వెళ్ళొచ్చు" అని తనలోతనే గొణుక్కుంటున్న శంకరం దగ్గరకు వచ్చి "బాబయ్యా ధర్మం చెయ్యండి బాబయ్యా!" అంటూ చేయి చాపాడు ఒక బిచ్చగాడు.

జేబులో నుండి ఒక రూపాయి బిళ్ళ తీసి వాడి చేతిలో వదేశాడు.

ఒకప్పుడు కానులు, అణాలు ఉండేవిట. వాటి స్థానంలో నయాపైసా, ఐదు పైసలు, పదిపైసలు వచ్చాయి. అవికూడా పోయి ఇప్పుడు బిచ్చగాడి బొచ్చెలో రూపాయి తప్పనిసరిగా వేయవలసి వస్తోంది. పావలా అర్ధ అపురూపమైపోయాయి. రూపాయి విలువ



ఎంత దిగజారుతున్నదో మనిషికి సంపాదన మీద అంత ఆరాటం పెరిగిపోతున్నది.

శంకరం ఆలోచనలను భంగపరుస్తూ-

"ఏంటి బాబయ్యా! రూపాయికి ఏం వస్తది? అయిదో పదో ఏస్తారనుకున్నాను" అంటున్న వాడి మాటలకు ఒళ్ళు మండి ఏదో అనబోయేంతలో బస్సు వచ్చి ఆగింది. వాడిని తప్పించుకుని అప్పటికే నిండుగా ఉన్న బస్సులోకి ఎలాగో ఎక్కాడు. అయినా శంకరం ఆలోచనలు మాత్రం ఇంకా ఆ బిచ్చగాడి చుట్టూనే తిరుగుతున్నాయి.

'ఐదో పదో ఇవ్వాలట! వీడికి నేనేదో బాకీ ఉన్నట్లు ఎంత దబాయించి అడుగుతున్నాడో! కొందరు బిచ్చగాళ్ళ దగ్గర బ్యాంక్ బ్యాలెన్స్‌లు కూడా బాగానే ఉంటాయిట. వడ్డీలకు అప్పులు కూడా ఇస్తారని, సొంత ఇళ్ళు ఉన్నవాళ్ళు కూడా వీళ్ళల్లో ఉంటారని, అయినా వృత్తిని వదిలిపెట్టకుండా ఇలా అడుక్కుంటూ ఉంటారని ఆమధ్య ఎక్కడో చదివినది గుర్తుకు వచ్చింది.'

★ ★ ★

"నమస్కారం సార్!" అంటూ నవ్వుతూ ఎదురొచ్చాడు ఆఫీసులో అటెండరు రాజయ్య. రోజూ తనను చూసి కూర్చున్నచోటు నుండి లేవను కూడా లేవని వాడు ఇవాళ ఇంత వినయం చూపిస్తున్నాడంటే కారణం ఏదో ఉండే ఉంటుంది అనుకున్నాడు శంకరం.

కొద్దిసేపటికే తెలిసింది. ఆరోజు ఆఫీసులో అందరికీ పండుగ బోనస్ ఇస్తున్నారు. తను రాగానే రాజయ్య దండం పెట్టటానికి కారణం ఇదన్నమాట. పండుగ మామూలు అందరి దగ్గరా నిలబెట్టి మరీ వసూలు చేస్తాడు రాజయ్య.

అందులో బోనస్ కూడావస్తే ఇంకా ఎక్కువే ముడుతుందని వాడి ఆశ.

సాయంత్రం ఇంటికి బయలుదేరబోతున్న శంకరం దగ్గరకు రాజయ్య వచ్చి "అయ్యగారు పిలుస్తున్నారు సార్" అన్నాడు. ఆఫీసరు గదిలోకి అడుగుపెట్టిన అతన్ని చూస్తూనే.

"రావయ్యా శంకరం" అంటూ ఆప్యాయంగా పిలిచాడు బాస్ అనబడే భక్తవత్సలం.

"చిన్నపని చేసిపెట్టాలోయ్!"

"చెప్పండి సార్!" అని వినయంగా అన్నాడు శంకరం.

ఆయన అంత సౌమ్యంగా మాట్లాడుతున్నాడంటే ఏ సునామీనో వచ్చి తనను ముంచివేయబోతున్నదన్నమాట అనుకుంటున్న శంకరంతో.

"రేపు నువ్వు ఆఫీసుకు వచ్చేటప్పుడు వచ్చే ఆదివారానికి చెన్నైకి రెండు ఫస్ట్‌క్లాస్ ఏ.సి.టిక్కెట్లు పట్టుకురావయ్యా! రేపు నువ్వు కొంచెం లేటుగా వచ్చిన ఫరవాలేదులే!" అంటూ అది ఆర్డరో, రిక్వెస్టో తెలియకుండా చెప్పాడు.

"వచ్చేసింది. సునామీ చెన్నై టిక్కెట్ల రూపంలో వచ్చిపడింది. హైదరాబాదు నుండి చెన్నైకి ఫస్ట్‌క్లాస్ ఏ.సి.టిక్కెట్లంటే ఎంతవుతుందో ఏమిటో! ఈ మహానుభావుడికి అప్పుడప్పుడు ఆఫీసు మెంబర్స్‌తో ఇలాంటి పనులు చేయించుకోవటం అలవాటే. ఈసారి తన వంతయింది. ఆయన పనులు పురమాయిస్తాడు కాని డబ్బు మాత్రం దేనికీ యివ్వడు. బాస్ కదా అని ఎవరూ అడగలేరు. ఒకవేళ ఎవరయినా అడిగినా, ఎదురుచెప్పినా వాళ్ళు ఆఫీసులో సక్రమంగా పని చేసుకోలేరు. ప్రమోషన్లు పొందలేరు. ఏదో విధంగా వాళ్ళను సతాయించి ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తుంటారు. అందుకే ఆయన చెప్పిన ఇలాంటి పనులను నోరు మెదపకుండా స్వంత డబ్బు ఖర్చుపెట్టి చేస్తుంటారు అందరూ.

భక్తవత్సలం ఆఫీసులో ఉండగా తన డబ్బులు ఒక్క పైసా కూడా వాడడు. డబ్బులు ముట్టచెప్పనిదే ఒక్క చిన్న ఫైలు కూడా కదల్చడు. ఎవరి పనీచేయడు. లంచం డబ్బులతోటే లంకంత ఇల్లు కట్టాడు అని అందరూ చెప్పుకుంటారు. ఒక కారు కూడా ఉండగా ఇప్పుడు మరో కారు కొనాలని ఆలోచిస్తున్నాడు. అయినా ఎవరికీ చిక్కడు-దొరకడు.


వందనోటు తీసి రాజయ్య చేతిలో పెట్టాడు శంకరం.

"సార్.." అంటూ 'ఇంతేనా!' అన్నట్లు చూశాడు రాజయ్య.

'ఇంతకన్నా ఇంకేం ఇవ్వమంటావు? బోనస్‌కు పడింది పెద్దబొక్క' అని మనసులో అనుకుని.

"ఇంటికి చుట్టాలొస్తున్నారు రాజయ్యా! ఖర్చులు చాలా ఉన్నాయి" అంటూ ఏదో చెప్పి తప్పించుకున్నాడు.

రాజయ్య దగ్గర బాస్ గురించి ఏమయినా నోరుజారితే వెంటనే ఆయనకు చేరుతుందని శంకరానికి



తెలుసు. ఎందుకంటే వాడు బాస్‌కి కుడిభుజం లాంటి వాడు. నమ్మినబంటు.

* * *

బోనస్ వచ్చిందని తెలిసి భ్రమరాంబ ఎగిరి గంతేసింది.

"బోనస్ వస్తే నీకు బంగారం కొనిపెడతాను భ్రమరం" అన్నాడు శంకరం. అందుకే ఆమెకు చాలా సంతోషంగా వుంది. గోల్డ్ షాపునకు వెళ్ళి కళ్ళు జిగేల్‌మనే రకరకాల ఆభరణాలన్నీ తనివితీరా చూసి తనకు బాగా నచ్చిన డిజైన్‌లో బంగారు నెక్లెస్ కొనుక్కోవాలి అని కలలుకంటూ ఆరోజుకోసం ఎప్పటి నుండో ఎదురుచూస్తోంది.

"భ్రమరం ఇలారా!" అన్న శంకరం పిలుపు విని గంతులాపి చెంత చేరింది.

జేబులో నుండి ఎర్రని చిన్న భరిణ తీసి భ్రమరం చేతిలో పెట్టాడు శంకరం.

"ఏమిటిది బావా?" అన్నది.

ఆమెకు భర్తమీద ప్రేమ ఎక్కువయినప్పుడు శంకరాన్ని అలాగే పిలుస్తుంది.

భరిణ మూత తీసి చూసింది భ్రమరాంబ.

అందులో ముత్యం పొదగబడి ఉన్న బంగారు ఉంగరం ముద్దులొలుకుతూ వుంది.

"నీ కోసమే భ్రమరం! బోనస్ వస్తే కొన్నాను. వేలికి పెట్టుకుని చూడు సరిపోతుందో లేదో!"

"ఉంగరమేనా శంకరం! నేనింకా నెక్లెస్ కొనుక్కుందామనుకున్నాను" అన్నది భ్రమరాంబ నిరుత్సాహంగా.

"నాకేమయినా లక్ష రూపాయల లాటరీ వచ్చిందనుకున్నావా?" అని.

'బోనస్‌గా వచ్చిందే తక్కువ. అందులో కోత కూడాను' మనసులో అనుకుని బాస్‌కు కొనే చెన్నై టిక్కెట్ల గురించి చెబితే అరచి గొడవ చేస్తుందేమోనని ఊరుకున్నాడు.

ముత్యపు ఉంగరాన్ని చిటికెన వేలికి పెట్టుకుని చేతిని తిప్పి తిప్పి చూసుకుంది భ్రమరం.

"ప్చ్! నెక్లెస్ ఎప్పుడు కొనుక్కుంటానో" అంటూ నిట్టూర్చింది.

* * *

'మీరు కోటీశ్వరులు కావాలనుకుంటున్నారా! ఇదే మా ఆహ్వానం! 'కలల లోకం' మీకు స్వాగతం పలుకుతోంది. రండి! త్వరపడండి! మీకు తోచినంత పెట్టుబడి పెట్టండి. మాతో కలిసి నడవండి. మీ కలలను సాకారం చేసుకోండి' అనే పేపర్లలోని ఒక ప్రకటన శంకరాన్ని బాగా ఆకర్షించింది.

కష్టపడకుండా కోటీశ్వరుడు కావటానికి ఇదేదో సులువైన మార్గంలా కనిపించింది. భవిష్యత్తు బంగారుమయంగా

## ఇక పెళ్లాడుతుందిట

మాజీ విశ్వసుందరి, బాలీవుడ్ భామ సుస్మితాసేన్‌కి ఓ దత్తపుత్రిక వున్న సంగతి అందరికీ తెలుసు. పెళ్లి మీద అంతగా ఇష్టంలేదు కనుక, అనాథను తన కూతురిగా పెంచుకుంటున్న సుస్మితకిప్పుడు 33 ఏళ్లొచ్చాయి. కాలంతోపాటు వయసు కూడా మనసును ప్రభావితం చేస్తుందనడానికి తాజా నిదర్శనం- ఇక తను తగిన భర్త దొరికితేగనక పెళ్లి చేసుకుని సినిమాలకు దూరంగా వుండాలనుకుంటున్నట్టు సన్నిహితుల దగ్గర చెబుతోందిట సుస్మిత. మరి ఆమెని భార్యగా స్వీకరించడంతోపాటు ఆమె దత్తపుత్రికను కూడా కూతురిగా చూసుకునే ఆ వరుడెవరో?

తోచింది. ఆ అడ్రసు నోట్ చేసుకుని మర్నాడు ఆఫీసుకు సెలవుపెట్టి మరీ వాళ్ళను కలవటానికి వెళ్ళాడు. అక్కడ తనలాంటివారే మరికొంతమంది అప్పటికే వచ్చి ఉన్నారు. 'కలల లోకం' అనేది ఒక రియల్ ఎస్టేట్ సంస్థ పేరు.

ఎవరెంత పెట్టుబడి పెట్టగలిగితే అంత పెట్టుబడితో వాళ్ళ పేరు మీద కన్‌స్ట్రక్షన్ మొదలుపెట్టేట్లు బిల్డింగ్ తమ ఖర్చుతో పూర్తిచేసి ఒక్కొక్కరికి ఒక్కొక్క ఫ్లాట్ కేటాయించి మిగిలిన నగదు సులభ వాయిదాలలో చెల్లించే అవకాశం కలిగించేటట్లు పత్రాలపై సంతకాలు చేయించుకుని ఒక్కొక్కరికి ఒక్కో కాపీ ఇచ్చారు. అంతేగాకుండా ప్రతి నెల అందరి పేర్లతో లాటరీ తీసి పేరు వచ్చిన వాళ్ళు మిగిలిన వాయిదాలు చెల్లించనక్కర లేకుండానే ఇంటిని స్వంతం చేసుకోవచ్చని కూడా అందులో ఉంది.

భ్రమరానికి కూడా ఈ పథకం బాగా నచ్చింది. 'కలల లోకం' పుణ్యమా అని తమకు మంచి రోజులు రాబోతున్నాయని ఇద్దరూ సంతోషించారు. కనీసం ముప్పయివేలయినా పెట్టుబడి పెట్టాలని అనుకున్నారు. ఎవరో తెలిసినవారి ద్వారా అధికవడ్డీకి ఇరవై వేలు అప్పు చేశాడు శంకరం. ఎలాగో బాస్‌ను ఒప్పించి ఆఫీసులో పదివేలు లోన్ తీసుకున్నాడు. మొత్తం ముప్పయి వేలు 'కలల లోకం'లో చెల్లించి ఊపిరి పీల్చుకున్నాడు. తక్కువ పెట్టుబడితే ఎక్కువ లాభం పొందబోతున్న తన తెలివితేటలను తలచుకుని త్వరలో తన దశ తిరగబోతున్నదని తెగ మురిసిపోయాడు శంకరం.

ఒకరోజు సంస్థవాళ్ళు పెట్టుబడిదారులందరినీ తమ స్వంత ఖర్చులతో తీసుకువెళ్ళి సైటు చూపించారు. కనుచూపుమేర కనిపిస్తున్న మైదానం అంతా చూసి దానిపై వాళ్ళు నిర్మించబోయే అందమైన భవనాలను ఊహించుకుని అందరూ ఆనందించారు.

అప్పటి నుండి కోటి రూపాయలు ఖరీదు చేసే ఇంటికి తాను యజమాని అయినట్లు కలగనేవాడు శంకరం. మొదటి నెల లాటరీలోనే తమ పేరు రావాలని కోరుకునేది భ్రమరాంబ.

* * *

ఒకనాటి శుభోదయం వేళ శంకరం, భ్రమరం కాఫీలు సేవిస్తూ కబుర్లు చెప్పుకుంటూ ఉండగా ఉన్నట్లుండి.

"ఏయ్ శంకరం!" అంటూ గట్టిగా పిలిచింది భ్రమరం.

"ఏంటి భ్రమరం! ఏమిటా అరుపులు? బల్లిగాని మీద పడిందా?" అన్నాడు శంకరం.

"బల్లికాదు బండరాయి పడింది మన నెత్తి మీద! ఈ పేపర్లో వార్త చూడు" అంటూ వార్తాపత్రికను అందించింది.

'కలలలోకం అనే రియల్ ఎస్టేట్ కంపెనీ వాళ్ళు బోర్డు తిప్పేసి అందరి దగ్గర పోగుచేసుకున్న భారీ మొత్తంతో పత్తాలేకుండా పారిపోయారు' ఇది అందులోని ఒక వార్త.

"అయ్యో! అయ్యో! మోసం! దగా! మన ముప్పయి వేలు!" అంటూ బిగ్గరగా ఏడవసాగింది భ్రమరం.

షాక్ తిన్నట్లయిన శంకరం నోట మాట రాక బిగుసుకుపోయి కాసేపటిగ్గాని తెప్పరిల్లలేక పోయాడు.

వెంటనే బయలుదేరి 'కలలలోకం' వాళ్ళు చూపించిన స్థలం దగ్గరకు వెళ్ళాడు. "ఇది ప్రభుత్వ స్థలం. దీనిని ఆక్రమించుకున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోబడును" అనే బోర్డు కనిపించింది అక్కడ.

పెట్టుబడుదారులంతా కలిసి ఆ సంస్థ ఆఫీసుకు వెళ్ళారు. అక్కడ ఆ బోర్డుగాని, ఆ మనుషుల తాలూకు ఆనవాళ్ళుగాని కనిపించలేదు.

అందరూ గోలగోలగా తమ ఆక్రోశాన్ని, ఆగ్రహాన్ని వెళ్ళగక్కటం మొదలుపెట్టారు. నీరసంగా ఇంటికి చేరాడు శంకరం. భ్రమరం ఇంకా బోరుమని విలపిస్తూనే ఉంది.

"ఊరుకో భ్రమరం! అంతా మనం చేతులారా చేసుకున్నదే! అంతస్తులు పెంచుకోవాలని ఆరాటపడి ఎవరినో నమ్మి మోసపోయాం మనకన్నా లక్షలు పెట్టిన వారున్నారు. లబోదిబోమంటున్నారు. ఊరుకో" అంటూ ఓదార్చాడు.

ఉన్నట్లుండి అంతెత్తుకు ఎదగాలని ఆశపడి ఊహల లోకంలో ఆకాశహర్మ్యాలను నిర్మించుకునే నైజం కల మధ్యతరగతి మనుషులు ఉన్నంతవరకు 'కలల లోకం' వంటి బోగస్ కంపెనీలు వెలుస్తూనే ఉంటాయి. డబ్బులు దండిగా దోచుకుని బోర్డు తిప్పేసి వాళ్ళను ఒక్కసారిగా బొక్కబోర్లా పడేలా చేస్తూ ఉంటాయి.

బిచ్చగాడు అయినా బడా ఆఫీసరు అయినా మనిషి ఆశాజీవి. ఆశకు అంతం లేదు. మనిషికి తృప్తి లేదు. ఆశ అనేది లేకపోతే మనిషిలో చైతన్యం ఆగిపోతుంది. రేపటి గురించిన ఎన్నో ఆశలతోటే ఈరోజు ఉత్సాహంగా గడపగలుగుతాడు. చిన్నదానికో పెద్దదానికో అడుగడుగునా ఆశల పోరాటమే మానవ జీవితం!

మనిషికి ఆశలు ఉండాలి కాని వాటిని అవకాశంగా చేసుకుని ఎత్తులు వేసే అవతలి వాళ్ళ చేతిలో చిత్తయిపోయే విధంగా ఉండకూడదు. ○



## మాధవీలత డేరింగ్

అచ్చతెలుగు హీరోయిన్లు తెలుగు సీమలో బాగా తగ్గిపోతున్న రోజుల్లో మాధవీలత లాంటి అమ్మాయిలు సక్సెస్ సాధించడం సంతోషించదగిన విషయం కదా! కానీ కేవలం రెండు సినిమాలు చేసిందో లేదో మాధవీలతకి బాగా ప్రౌడ్ అనే వార్తలు సినీజనాల్లో చక్కర్లు చేయడం శోచనీయంగానే అనిపిస్తుంది. కానీ మాధవీలత మాత్రం- 'ఎవరో గిట్టనివాళ్లు కొంతమంది చేసే ఇలాంటి ప్రచారాల్ని పట్టించుకోను. నాకు ఆత్మవిశ్వాసం ఎక్కువ. నా మీద నాకు నమ్మకం వున్నప్పుడు ఇలాంటి ప్రచారాలకు నేనసలు భయపడను' అంటుంది.